

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

ఈర్నపాడులో : ఏ డి డాక్టర్ వెంకటేశ్వర్లు



Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 195 | పేజీలు - 08 | వెల - 05/- | ఆదివారం 12-07-2026




# వియత్నాంలో ఘోర బోటు ప్రమాదం..

మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్న సీఎం

- వియత్నాం బోటు ప్రమాదంలో ముగ్గురు ఏపీ వాసుల మృతి
- ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- బాధితులను ఆదుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- మృతదేహాల తరలింపునకు చర్యలు చేపట్టాలని సూచన

వియత్నాంలో జరిగిన పర్యాటక బోటు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విహారయాత్ర విషాదంగా మారడం తనను ఎంతగానో కలచివేసిందని ఆయన ఆవేదన చెందారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

*రాష్ట్రం నుంచి మొత్తం 33 మంది పర్యాటకులు వియత్నాం వెళ్లగా, వారిలో 19 మంది ప్రమాదానికి గురైన బోటులో ప్రయాణిస్తున్నారు. ఈ దుర్ఘటనలో కడప జిల్లాకు చెందిన ముడియం శ్రీధర్, కృష్ణా జిల్లా వాసి గెల్లి జయలక్ష్మి, సత్యసాయి జిల్లాకు చెందిన నల్లపేట ఆదిశేషయ్య రవితేజ ప్రాణాలు కోల్పోయారు. మరో పర్యాటకుడు, కృష్ణా జిల్లాకు చెందిన గెల్లి కిశోర్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. మిగిలిన వారంతా సురక్షితంగా ఉన్నారు.*

## జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తు

- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం
- విజయవాడలో జరిగిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు
- జనాభా నియంత్రణ నుంచి సంరక్షణ వైపు ప్రభుత్వ విధానం
- 'పిల్లలే సంపద' పేరుతో కొత్త కార్యక్రమానికి నాంది
- యువత నైపుణ్యం, వృద్ధుల అనుభవం దేశానికి ఆస్తి అన్న సీఎం

## బ్యారేజీ గేట్లు మూస్తే కూలిపోతాయి: ముఖ్యమంత్రి హెచ్చరిక

- కాళేశ్వరం బ్యారేజీల గేట్లు మూయడం ప్రమాదకరమని ముఖ్యమంత్రి హెచ్చరిక
- పునరుద్ధరణ పూర్తయ్యే వరకు గేట్లు తెరిచే ఉంచాలని స్పష్టీకరణ
- జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారమే మరమ్మతులు
- బీఆర్ఎస్ నేతల కమిటీ సిఫార్సులను పక్కనపెడుతున్నట్టు వెల్లడి
- గత ప్రభుత్వ అవినీతి వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి అని విమర్శలు



కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల పునరుద్ధరణ పనులు పూర్తికాకుండా గేట్లు మూసివేస్తే, వాటి మనుగడకే పెను ప్రమాదం వాటిల్లుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. బ్యారేజీల భద్రత విషయంలో నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను తు.చ. తప్పకుండా పాటించడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి, కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డను వెన్నెముకగా, శ్రీపాద యల్లంపల్లిని గుండెకాయగా అభివర్ణించారు. మేడిగడ్డ నిర్మాణ

మిగతాది 2లో

# తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు



- తెలంగాణ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందన్న అశ్వినీ వైష్ణవ్
- హైదరాబాద్ నుంచి విజయవాడకు గంటలో చేరుకోవచ్చన్న రైల్వే మంత్రి
- తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని వ్యాఖ్య

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఏడు బుల్లెట్ రైళ్లలో, ఏకంగా మూడు రూట్లు తెలంగాణకే దక్కడం విశేషమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వల్లే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# హెలికాప్టర్ ఆపితే.. రైల్లో వస్తారు

: జగన్ భీమవరం పర్యటనపై పేర్ని నాని



- జగన్ భీమవరం పర్యటనను కూటమి ప్రభుత్వం అడ్డుకోలేదన్న పేర్ని నాని
- హెలిప్యాడ్‌కు పర్మిషన్ ఇవ్వకపోతే జగన్ రైలు ఎక్కైనా వస్తారని వ్యాఖ్య
- ఆక్వా రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ

ఆక్వా రైతుల సమస్యలపై వైసీపీ అధినేత జగన్ చేపట్టబోయే భీమవరం పర్యటనను కూటమి ప్రభుత్వం ఏ రకంగానూ అడ్డుకోలేదని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని స్పష్టం చేశారు. ఒకవేళ హెలిప్యాడ్‌కు పర్మిషన్ ఇవ్వకపోతే.. జగన్ రైలు ఎక్కైనా సరే భీమవరం వచ్చి రైతులను కలుస్తారని తేల్చిచెప్పారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలోని బువ్వనపల్లిలో ఈరోజు జరిగిన ఆక్వా రైతుల ఆత్మీయ సమావేశంలో పేర్ని నాని పాల్గొని మాట్లాడారు.న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఆక్వా రైతాంగం తీవ్రమైన కష్టాల్లో ఉన్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్ని నాని మండిపడ్డారు. ఆక్వా మేత ధరలు ఆకాశాన్నంటుతున్నా వాటిని అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. మేత కంపెనీల యాజమాన్యాలు, మిగతాది 2లో

# మా నాన్న మృతికి ప్రతీకారం తప్పదు

: మొజ్తబా ఖమేనీ ప్రకటన



● తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ప్రతిజ్ఞ ● అమెరికా-ఇజ్రాయెల్ దాడిలోనే తండ్రి ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ● హంతకులు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని టెలిగ్రామ్‌లో హెచ్చరిక ● ఫిబ్రవరి దాడిలో గాయపడిన మొజ్తబా.. తండ్రి అంత్యక్రియలకు దూరం

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. తన తండ్రి, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ శపథం చేశారు. టెలిగ్రామ్ ద్వారా విడుదల చేసిన సందేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతాది 2లో

## రైతాంగాన్ని రేవంత్ నిలువునా ముంచేస్తున్నారు

● మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూయకుండానే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయవచ్చన్న కేటీఆర్ ● 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని వ్యాఖ్య ● కాళేశ్వరంను బద్నాం చేయాలనే కుట్రతోనే నీళ్లు ఇవ్వడం లేదని ఆరోపణ



తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై

## మధుర గాయని ఎస్.జానకి గుండెపోటుతో కన్నుమూత

- ప్రముఖ గాయని ఎస్. జానకి (88) మైసూరులో కన్నుమూత
- ఆరు దశాబ్దాల కెరీర్‌లో 48 వేలకు పైగా పాటలు పాడిన గానకోకిల
- 2013లో ప్రకటించిన పద్మభూషణ్‌ను సున్నితంగా తిరస్కరించిన వైనం
- కొద్ది నెలల క్రితమే ఏకైక కుమారుడిని కోల్పోయిన జానకి



భారతీయ సినీ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్న ప్రముఖ గాయని, 'దక్షిణ భారత గాన కోకిల'గా ప్రఖ్యాతి గాంచిన ఎస్.జానకి (శిష్టా శ్రీరామమూర్తి జానకి) ఇకలేరు. గత కొంతకాలంగా వయోభారంతో బాధపడుతున్న ఆమె, శనివారం, జూలై 11న కర్ణాటకలోని మైసూరులో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. ఆరు దశాబ్దాల పాటు తన గాన మాధుర్యంతో కోట్లాది మంది సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసిన జానకమ్మ మరణంతో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసినట్లయింది. ఆమె మనవరాలు అప్సర వైద్యుల ఈ విషయాన్ని ధ్రువీకరించారు. జానకికి గుండెపోటు రావడంతో ఈ మధ్యాహ్నం 12.49 గంటలకు అపోలో ఆసుపత్రిలో చేర్చారు.

మిగతా 2లో



## సాయికృష్ణ లాకప్ డెత్ కేసు

- సీఐ నాగరాజును తరలించేటప్పుడు పూర్తిగా వీడియో తీయాలన్న హైకోర్టు
- హైకోర్టు నిబంధనలు దర్యాప్తు స్వేచ్ఛను హరించేలా ఉన్నాయంటూ సుప్రీంలో సిట్ పిటిషన్
- వచ్చే వారం పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం

విజయవాడలో తీవ్ర సంచలనం సృష్టించిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా

2లో

# ప్రపంచ వాయుసేనల్లో భారత్‌కు 3వ స్థానం..



● గ్లోబల్ ఎయిర్ పవర్ ర్యాంకింగ్స్‌లో భారత వాయుసేనకు మూడో స్థానం ● వరుసగా ఐదో ఏడాది చైనాను అధిగమించిన ఐఏఎఫ్ ● అమెరికా, రష్యా తర్వాత మూడో శక్తివంతమైన వాయుసేనగా గుర్తింపు ● నాణ్యత, ఆధునికీకరణ వల్లే భారత్‌కు మెరుగైన ర్యాంకు 1,716 విమానాలతో పటిష్ఠంగా ఉన్న భారత వాయుసేన

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన వాయుసేనల జాబితాలో భారత

# మధుర గాయని ఎస్.జానకి గుండెపోటుతో కన్నుమూత

ఆమె వయసు 88 సంవత్సరాలు. ఆరు దశాబ్దాల పాటు తన గాన మాధుర్యంతో కోట్లాది మంది సంగీత




ప్రియులను మంత్రముగ్ధులను చేసిన జానకమ్మ మరణంతో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసినట్లయింది. ఆమె మనవరాలు అప్సర వైద్యుల ఈ విషయాన్ని ధ్రువీకరించారు. జానకికి గుండెపోటు రావడంతో ఈ మధ్యాహ్నం 12.49 గంటలకు అపోలో ఆసుపత్రిలో చేర్చారు. అయితే, చికిత్స పొందుతూ రాత్రి 7.30 గంటలకు తుదిశ్వాస విడిచినట్టు ఆసుపత్రి వర్గాలు ప్రత్యేక బులెటిన్ ద్వారా వెల్లడించాయి.ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో 1938 ఏప్రిల్ 23న శిష్టా శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులకు జానకి జన్మించారు. ఆమె తండ్రి ఆయుర్వేద వైద్యుడు, ఉపాధ్యాయుడు. బాల్యం ఎక్కువగా సిరిసిల్లలో గడిచింది. తొమ్మిదేళ్ల వయసులోనే తొలిసారి వేదికపై పాడి తనలోని గాన ప్రతిభను చాటుకున్నారు. మేనమామ సలహాతో మద్రాసు చేరిన ఆమె, ఏవీఎం స్టూడియోస్‌లో సంగీత దర్శకుడు ఆర్. సుదర్శనం వద్ద తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1957లో తమిళ చిత్రం 'విధియిన్ విలైయాట్టు'తో నేపథ్య గాయనిగా అరంగేట్రం చేసిన జానకి, అదే ఏడాది తెలుగులో 'ఎమ్మెల్యే' చిత్రంలో పాడారు. తొలి సంవత్సరంలోనే ఏకంగా ఆరు భాషల్లో పాటలు పాడి అబ్బురపరిచారు. ఆమె ఆరు దశాబ్దాల సుదీర్ఘ సంగీత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు 20 భారతీయ భాషల్లో, అలాగే ఇంగ్లీష్, జపనీస్, జర్మన్ వంటి విదేశీ భాషల్లోనూ కలిపి 48,000కు పైగా పాటలను రికార్డ్ చేశారు. తన మాతృభాష తెలుగు అయినప్పటికీ, ఆమె అత్యధికంగా కన్నడంలో, ఆ తర్వాత మలయాళంలో పాటలు పాడారు. భావాన్ని బట్టి స్వరాన్ని మార్చడంలో ఆమెకు ఆమే సాటి. అందుకే ఆమెను 'క్వీన్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అండ్ మాడ్యులేషన్' అని పిలుస్తారు. పీబీ శ్రీనివాస్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ రాజ్‌కుమార్‌లతో కలిసి ఆమె పాడిన యుగళగీతాలు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఇళయరాజా, ఎం.ఎస్. విశ్వనాథన్, ఏ.ఆర్. రెహమాన్ వంటి దిగ్గజ సంగీత దర్శకులతో ఆమె చేసిన పని అజరామరం.ఆమె గాత్రానికి 4 జాతీయ పురస్కారాలు, 33 రాష్ట్ర స్థాయి పురస్కారాలు లభించాయి. మైసూరు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. 2013లో కేంద్ర ప్రభుత్వం ఆమెను 'పద్మభూషణ్' పురస్కారానికి ఎంపిక చేయగా, తన సంగీత సేవలకు 'భారతరత్న' రావాలని భావిస్తూ ఆ పురస్కారాన్ని సున్నితంగా తిరస్కరించి తన ఆత్మగౌరవాన్ని చాటుకున్నారు. 2017 అక్టోబర్ 28న మైసూరులో నిర్వహించిన కచేరీతో ఆమె తన గాన ప్రస్థానానికి వీడ్కోలు పలికారు. 1959లో వి. రామ్‌ప్రసాద్‌ను వివాహం చేసుకున్న ఆమెకు ఒక కుమారుడు మురళీ కృష్ణ ఉన్నారు. భర్త రామ్‌ప్రసాద్ 1997లో గుండెపోటుతో మరణించారు. కాగా, ఈ ఏడాది జనవరిలోనే ఆమె ఏకైక కుమారుడు మురళీకృష్ణ అనారోగ్యంతో కన్నుమూయడం ఆమెను తీవ్రంగా కలచివేసింది. కుమారుడిని కోల్పోయిన కొద్ది నెలలకే జానకి కూడా భౌతికంగా దూరమవ్వడంతో సంగీత ప్రపంచం శోకసంద్రంలో మునిగిపోయింది.

# ప్రపంచ వాయుసేనల్లో భారత్‌కు 3వ స్థానం..

1,716 విమానాలతో పటిష్ఠంగా ఉన్న భారత



వాయుసేన ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన వాయుసేనల జాబితాలో భారత వాయుసేన (ఐఏఎఫ్) మరోసారి తన సత్తా చాటింది. వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మోడరన్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ (డబ్ల్యుడీఎంఎంఏ) విడుదల చేసిన 2026 గ్లోబల్ ఎయిర్ పవర్ ర్యాంకింగ్స్‌లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో వరుసగా ఐదో ఏడాది కూడా చైనాను వెనక్కి నెట్టి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికాకు చెందిన వివిధ వైమానిక విభాగాలు అగ్రస్థానంలో ఉండగా, రష్యా రెండో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో, స్వతంత్ర జాతీయ వాయుసేనల పరంగా విశ్లేషిస్తే అమెరికా, రష్యాల తర్వాత ప్రపంచంలోనే మూడో అత్యంత శక్తిమంతమైన వాయుసేనగా భారత్ నిలిచినట్లవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. డబ్ల్యుడీఎంఎంఏ 'ట్రూ వాల్యూ రేటింగ్' (టీవీఆర్) ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించింది. ఇందులో భారత వాయుసేన 69.4 పాయింట్ల స్కోరు సాధించగా, చైనా వాయుసేన 63.8 స్కోరుతో వెనుకంజలో ఉంది. కేవలం విమానాల సంఖ్యనే కాకుండా వాటి సాంకేతిక సామర్థ్యం, పైలట్ల శిక్షణ, లాజిస్టిక్స్, భవిష్యత్ ప్రణాళికలు, ఆధునికీకరణ వంటి కీలక అంశాలను డబ్ల్యుడీఎంఎంఏ పరిగణనలోకి తీసుకుంది. భారత వాయుసేన వద్ద సుమారు 1,716 విమానాలు ఉన్నాయి. ఇందులో ఫైటర్ జెట్లు, హెలికాప్టర్లు, రవాణా విమానాలు సమతూకంలో ఉండటం వల్లే చైనా కంటే మెరుగైన ర్యాంకు లభించింది. అయితే, భారత వాయుసేన ముందు ప్రస్తుతం కొన్ని సవాళ్లు ఉన్నాయి. దేశ రక్షణకు అవసరమైన 42 ఫైటర్ స్క్వాడ్రన్లకు బదులుగా ప్రస్తుతం 29 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ లోటును భర్తీ చేసేందుకు 180 తేజస్ ఎంకే-1ఏ యుద్ధ విమానాల కొనుగోలుతో పాటు, స్వదేశీ పరిజ్ఞానంతో యుద్ధ విమానాల తయారీని ప్రభుత్వం వేగవంతం చేస్తోంది.

# బ్యారేజీ గేట్లు మూస్తే కూలిపోతాయి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక

శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి, కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డను వెన్నెముకగా, శ్రీపాద యల్లంపల్లిని గుండెకాయగా అభివర్ణించారు. మేడిగడ్డ నిర్మాణ సమయంలో ఎదురయ్యే సవాళ్లపై గత ప్రభుత్వ హయాంలోనే ఇంజనీర్లు హెచ్చరించినప్పటికీ, కొందరు అధికారులు ఇప్పుడు మాట మారుస్తున్నారని ఆయన ఆరోపించారు. బ్యారేజీల పునరుద్ధరణ కోసం జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కమిటీ చేసిన సూచనలనే తమ ప్రభుత్వం పాటిస్తుందని, బీఆర్ఎస్ నేతలతో కూడిన కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవడం లేదని తేల్చిచెప్పారు. "పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకుండా గేట్లు మూసివేస్తే బ్యారేజీలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిర్మాణాలు స్థిరంగా ఉన్నప్పుడే నీటి నిల్వ, పంపింగ్ సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయడానికి మేడిగడ్డలో కనీసం 5 టీఎంసీల నీటి నిల్వ అవసరమని, అయితే భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నిపుణుల సలహాల మేరకే తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, లోపభూయిష్టమైన ప్రణాళికల వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి దాపురించిందని ముఖ్యమంత్రి విమర్శించారు. భద్రాచలం వంటి ప్రాంతాలు ముంపునకు గురయ్యేలా నీటిని ఎత్తిపోసే ప్రసక్తే లేదని, ప్రజల భద్రతకు, ప్రభుత్వ వనరులకు నష్టం కలగకుండా ప్రాజెక్టును పునరుద్ధరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



# జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తు: సీఎం

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర జనాభా విధానంపై



ఒక సంచలనాత్మక, కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వాలు అనుసరించిన 'జనాభా నియంత్రణ' విధానానికి స్వస్తి పలికి, 'జనాభా సంరక్షణ' అనే కొత్త దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. "జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తు" అనే నినాదాన్ని ఇస్తూ, భవిష్యత్తులో 'పిల్లలే సంపద' అనే మాటను నిజం చేసి చూపిస్తామని ఆయన ప్రకటించారు. విజయవాడలో నేడు (జులై 11) జరిగిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

గతంలో ప్రభుత్వాలు జనాభా నియంత్రణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాయని, అందులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారిని అనర్హులుగా ప్రకటించే నిబంధనలు కూడా తెచ్చామని చంద్రబాబు గుర్తుచేశారు. అయితే, ప్రస్తుతం మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆ విధానాలను మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు.

"దేశమంటే మట్టి కాదోయ్- దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పిన మాటల్ని మరోసారి గుర్తు చేసుకోవాలి. జనాభా నియంత్రణ కాదు, జనాభా సంరక్షణ కార్యక్రమాల్ని ప్రభుత్వం చేపడుతుంది. గతంలో మహిళల్లో అక్షరాస్యత పెరిగితే జనాభా నియంత్రణ సాధ్యమని భావించాం. 'ఒక్కరు ముద్దు, ఇద్దరితో సరి' వంటి ప్రచారాలు చేశాం. కానీ ఇప్పుడు రాష్ట్రంలో, దేశంలో ఫెర్టిలిటీ రేటు గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉంది" అని ముఖ్యమంత్రి వివరించారు.

ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా దేశాల్లో జనాభా తగ్గిపోతోందని, భారతదేశంలో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. "అభివృద్ధి సంతులనం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకం. రాష్ట్రంలో అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 89 శాతం మందికి రెండో సంతానం లేదు. విశాఖ వంటి జిల్లాల్లో ఫెర్టిలిటీ రేటు చాలా తక్కువగా ఉంది. విస్తీర్ణంలో ఏపీ 7వ స్థానంలో ఉన్నా, జనసాంద్రతలో దిగువన ఉన్నాం. పిల్లలే మన రాష్ట్ర సంపద. వారితోనే ఆర్థిక ప్రగతి" అని ఆయన అన్నారు.

చిన్న కుటుంబాల భావన పెరిగిపోవడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగు కావడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. "మైక్రో ఫ్యామిలీల గురించి యువత ఆలోచించడం ప్రమాదకరం. సంతానం వద్దనుకునే దంపతులు పెరగటం దురదృష్టకరం. భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థే ప్రపంచానికి ఆదర్శం. పిల్లలే సంపద- ఉమ్మడి కుటుంబమే శ్రీరామ రక్ష" అని ఆయన అన్నారు. పిల్లలను పెంచడం కేవలం మహిళల బాధ్యతే కాదని, అదొక ఉమ్మడి బాధ్యత అని స్పష్టం చేశారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కాన్పుల్లో సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలని సూచించారు.

ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో పోక్సో నిందితుడు ఒకే కుటుంబంలో ఆరుగురిని హత్య చేసిన ఘటనను ప్రస్తావిస్తూ, సోషల్ మీడియా వ్యసనంగా మారి మానసిక సమస్యలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. టెక్నాలజీకి ఆధ్యాత్మికతను జోడించడం ద్వారా యువత ప్రపంచాన్ని జయించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. యువత నైపుణ్యం, వృద్ధుల అనుభవం సమాజానికి రెండు కళ్ల వంటివని, వారిని ఆస్తిగా మార్చాలని సీఎం అన్నారు. త్వరలో వృద్ధుల కోసం 'క్షేమం' అనే కార్యక్రమాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. 'తల్లికి వందనం' ద్వారా విద్యార్థులకు, 'సంజీవని' ద్వారా ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తోందన్నారు. 2047 నాటికి రాష్ట్ర తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేర్చాలన్న తన సంకల్పానికి, 2040 నాటికే స్వర్ణాంధ్ర సాధనకు తగినంత మానవ వనరులు అత్యవసరమని ఆయన పునరుద్ఘాటించారు. అనంతరం 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్' డాక్యుమెంటేషన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా తదితరులు పాల్గొన్నారు.

# మా నాన్న మృతికి ప్రతీకారం తప్పదు

ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడిలో అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన తండ్రి మృతికి కారకులైన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మొజ్తబా హెచ్చరించారు. ఇది దేశ ప్రజల డిమాండ్ అని, తన నాయకుడితో పాటు అమరులైన వారి తరఫున హంతకులపై ప్రతీకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా.. జులై 9న జరిగిన తన తండ్రి అంత్యక్రియలకు కూడా హాజరు కాలేకపోయారు. తనను లక్ష్యంగా చేసుకుంటే తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన నేపథ్యంలో మొజ్తబా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు

ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా, హైదరాబాద్ నగరవాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, అటు చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మంత్రి మండిపడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని, గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ. 5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఈ నిధుల వరద వల్లే రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయనిస్పష్టం చేశారు.

# సాయికృష్ణ లాకప్ డెత్ కేసు

సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు పోలీస్ కస్టడీ విచారణపై రాష్ట్ర హైకోర్టు విధించిన కఠినమైన నిబంధనలను సవాలు చేస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు పెట్టిన కొన్ని నిబంధనలు దర్యాప్తు స్వేచ్ఛను హరించేలా ఉన్నాయంటూ ప్రభుత్వం ఈ పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేసింది. ముఖ్యంగా నిందితుడి ట్రాన్సిట్ సమయంలో అంటే ఒక చోటు నుంచి మరో చోటుకు తరలించేటప్పుడు పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలన్న హైకోర్టు షరతును సిట్ అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇలా నిరంతరం వీడియో నిఘా ఉంచడం వల్ల అత్యంత కీలకమైన ఈ కేసు దర్యాప్తులో గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిని విచారించే క్రమంలో పోలీసులు అనుసరించే వ్యూహాలు పక్కదారి పట్టే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. ఈ కేసులో అసలు నిజాలు బయటకు రావాలన్నా, సాయికృష్ణ మృతదేహం అన్వేషణ, సీన్ రీకన్‌స్ట్రక్షన్ వేగంగా జరగాలన్నా హైకోర్టు విధించిన కండిషన్లు అడ్డంకిగా మారాయని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఎటువంటి కఠినమైన షరతులు లేకుండా నిందితుడిని పూర్తిస్థాయిలో విచారించేందుకు అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. విజయవాడ కస్టోడియల్ డెత్ కేసులో అసలు నిజాలు రాబట్టేందుకు ఇప్పుడు సుప్రీంకోర్టు ఇవ్వబోయే తీర్పు అత్యంత కీలకంగా మారింది. సిట్ దాఖలు చేసిన ఈ పిటిషన్ వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# రైతాంగాన్ని రేవంత్ నిలువునా ముంచేస్తున్నారు

తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్




ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కేటీఆర్ మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి సీఎం సోయి తెచ్చుకోవాలని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఫోరం సూచించిందని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి ప్రవాహం ఉందని చెప్పారు. 94 మీటర్ల లభ్యత వద్దే పంపులు ఆన్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారని... ఈ లెక్కన నీటిని పంప్ చేయవచ్చని అన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నా ఈ ప్రవాహం మరో 100 రోజులు కొనసాగుతుందని... రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. 'ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు' అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన కొనసాగితే కాంగ్రెస్‌కు 117 సీట్లు కాదు కదా... 7 సీట్లు కూడా రావని హెచ్చరించారు.

# వియత్నాంలో ఘోర బోటు ప్రమాదం...

ఈ ఘటనపై వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు, బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని, మిగిలిన వారిని సురక్షితంగా రాష్ట్రానికి తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, స్థానిక అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. మృతుల దేహాలను వీలైనంత త్వరగా స్వస్థలాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు

# హెలికాప్టర్ ఆపితే.. రైల్లో వస్తారు:



పాలకులు చేతులు కలపడం వల్లే పెట్టుబడి వ్యయం పెరిగిపోయి రైతులు భారీ నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆరోపించారు. ఆక్వా రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు జులై 15వ తేదీన జగన్ భీమవరం రావడం ఖాయమైందని పేర్ని నాని వెల్లడించారు. ఈ పర్యటనను ఫ్లాప్ చేయడానికి లేదా అడ్డుకోవడానికి ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా, కుతంత్రాలు చేసినా జగన్ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. "కూటమి ప్రభుత్వం హెలిప్యాడ్‌కు అనుమతులు నిరాకరిస్తే నిరాకరించుకోవచ్చు. జగన్ అవసరమైతే సామాన్యుడిలా రైల్లో ప్రయాణించి అయినా సరే ఇక్కడికి చేరుకుంటారు. రైతులను కలిసి వారి సమస్యలపై ప్రభుత్వం దిగివచ్చేలా పోరాడుతారు" అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని, లేదంటే ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## శనివారం మద్దిలేటి స్వామి
# దర్శనానికి పోటెత్తిన భక్తులు

బేతంచెర్ల, పల్లె వెలుగు జులై 10: నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్





రంగాపురం గ్రామ శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం భక్తులతో కిటకిటలాడింది. వారాంతం కావడంతో నంద్యాల, కర్నూలు, కడప జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు పొడవైన క్యూ లైన్లలో వేచి ఉన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా క్యూ లైన్ల వద్ద తాగునీటి సదుపాయం, అన్న దానసత్రంలో భోజనం ఏర్పాట్లు తలనీలాల దగ్గర పుట్టు వెంట్రుకలకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని వసతులు , ఏర్పాటు చేశారు. పోలీసులు కూడా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రోజంతా గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది.

# పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

- క్షేత్రస్థాయిలో ఏఈఆర్ఓ, ఎండీపీఓ జి.ఎన్.ఎస్. రెడ్డి తనిఖీ
- రేపటికల్లా ప్రక్రియ ముగించాలని ఆదేశం



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్ఓ) జి.ఎన్.ఎస్. రెడ్డి పలు పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా దూపాడు పరిధిలోని పోలింగ్ కేంద్రం సంఖ్య 57తో పాటు, చిన్నటేకూరు గ్రామ పరిధిలోని పోలింగ్ కేంద్రాల సంఖ్య 43, 44, 45 తదితర కేంద్రాలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. 'సిర్' (ఎస్ఐఆర్) ఎన్నికల మ్యాపింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించి, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఈఆర్ఓ/ఎండీపీఓ జి.ఎన్.ఎస్. రెడ్డి మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎలాంటి లోపాలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియ జరగాలన్నారు. రేపటి (ఆదివారం) కల్లా ఈ మ్యాపింగ్ పనులన్నింటినీ పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈర్నపాడులో : ఏ డి డాక్టర్ వెంకటేశ్వర్లు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై : వెలుగోడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకు



లు డాక్టర్ వెంకటేశ్వర్లు శనివారం మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామాన్ని సందర్శించారు. పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా జరిగిన ఒక సమావేశంలో ఏడి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు.పశువుల అభివృద్ధికి నాణ్యమైన పశుగ్రాసం ఎంతో అవసరమని డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా ఈర్నపాడు గ్రామంలో డాక్టర్ జ్యోష్న దేవి ఆధ్వర్యంలో రైతులకు పశుగ్రాసం ప్రాధాన్యతను వివరించారు.పశువులకు సమతుల్య ఆహారం అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరగడంతో పాటు పశువుల ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. ముఖ్యంగా మేత కొరతను ఎదుర్కొనేందుకు ముందుగానే పశుగ్రాస పంటలను సాగు చేసి నిల్వ చేసుకోవాలని రైతులకు సూచించారు. పశుగ్రాస పంటల సాగు, సైలేజ్ తయారీ, మేత నిల్వ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమీరా,గ్రామ రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు సజీవంగా ఉండాలంటే 'SIR'
# ఫారాలను వెంటనే అందజేయాలి

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ
- కల్లూరు 97వ సచివాలయంలో ఎన్యూమరేషన్ ఫారం సమర్పణ



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజలు తమ ఓటు హక్కును సజీవంగా నిలుపుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన 'ఎస్ఐఆర్' (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ పిలుపునిచ్చారు. శనివారం కల్లూరు మండలం 37వ వార్డు, రెండు ట్యాంకుల సమీపంలోని 97వ సచివాలయంలో ఆమె తన 'ఎస్ఐఆర్' ఎన్యూమరేషన్ ఫారమును బూత్ లెవెల్ అధికారికి (బీఎల్ఓ) అందజేశారు.

ఈ సందర్భంగా కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ.. ఓటర్లు తమకు కేటాయించిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఈ నెల 14వ తేదీ లోపు తప్పనిసరిగా సంబంధిత బిఎల్ఓలకు తిరిగి సమర్పించాలన్నారు. గడువులోగా ఫారాలు ఇవ్వని పక్షంలో ఓటును కోల్పోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. గడువు ముగిసిన తర్వాత సవరణలకు అవకాశం ఉన్నప్పటికీ, అనేక రకాల ధృవీకరణ పత్రాలు (ప్రూఫ్‌లు) సమర్పించాల్సి వస్తుందని, కాబట్టి ప్రజలు శ్రమ పడకుండా ఈనెల 14 లోపే తమ పరిధిలోని బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓ), ఎమ్మార్వో (ఈఆర్ఓ) లేదా ఆర్డీఓ (ఏఈఆర్ఓ)లను సంప్రదించి ఓటును భద్రపరుచుకోవాలని కోరారు.

**ఓటు ఎంతో విలువైనది..**

ఆరోగ్యవంతమైన జీవితానికి ఆహారం ఎంత ముఖ్యమో, ఒక మంచి ప్రభుత్వం ఏర్పడటానికి ప్రతి ఒక్కరి ఓటు అంతే విలువైనదని పార్వతమ్మ పేర్కొన్నారు. ఓటరుగా నమోదు కావడం ఎంత ప్రాముఖ్యమో, ఎన్నికల సమయంలో ఓటు హక్కును వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యమని గుర్తుచేశారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా (ఎస్ఐఆర్) కార్యక్రమం ద్వారా 2002లో ఓటు ఎక్కడ ఉందో బిఎల్ఓలకు తెలియజేసి, ప్రస్తుతం కొత్తగా తయారు చేసే ఓటరు జాబితాలో తాము నివసిస్తున్న ప్రాంతంలోనే ఓటు పొందేందుకు ప్రజలంతా బిఎల్ఓలకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో 37వ వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర, సచివాలయ అధికారులు, సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కల్లూరులో 'SIR' ప్రత్యేక ఓటర్ల క్యాంప్..
# పకడ్బందీగా పరిశీలించిన జేసీ నూరుల్ కమర్

- పోలింగ్ కేంద్రాలు 100 నుండి 120 వరకు ఒకే చోట నిర్వహణ
- మరణించిన, డూప్లికేట్, షిఫ్ట్ అయిన ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: జాయింట్ కలెక్టర్ ఆదేశం





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం కర్నూలు జిల్లా కల్లూరు గ్రామ పరిధిలో శనివారం 'ఎస్ఐఆర్' (ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల ప్రత్యేక అవగాహన, దరఖాస్తుల స్వీకరణ క్యాంప్‌ను పకడ్బందీగా నిర్వహించారు. కల్లూరు పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 100 నుండి 120 వరకు సంబంధించిన అన్ని బూత్‌ల పరిధిని ఒకే కేంద్రంగా అనుసంధానించి ఈ ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓ) అందరూ హాజరై ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తూ విధులు నిర్వహించారు.

ఈ ప్రత్యేక క్యాంప్‌ను కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ & ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) నూరుల్ కమర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్ఓ) మరియు డిప్యూటీ తహసీల్దార్ అందాల గారు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జేసీ నూరుల్ కమర్ ప్రతి బీఎల్ఓ టేబుల్ వద్దకు వెళ్లి ఓటర్ల ఎన్యుమరేషన్ ఫార్మ్‌ల నమోదు ప్రక్రియను, ప్రజలకు అందిస్తున్న సేవలను నిశితంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా ప్రక్షాళన:**

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించడమే లక్ష్యంగా ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియ కొనసాగుతోందన్నారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో మరణించిన ఓటర్లు, డూప్లికేట్ (రెండు చోట్ల ఓటు ఉన్నవారు), గుర్తించలేని (అన్‌ట్రేసబుల్) ఓటర్లు, అలాగే శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన (పర్మనెంట్లీ షిఫ్టెడ్) ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించి జాబితాను ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. అదే సమయంలో కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం తక్షణమే స్వీకరించి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

ఈ క్యాంప్‌నకు స్థానిక ప్రజలు భారీగా తరలివచ్చి తమ ఎన్యుమరేషన్ ఫార్మ్‌లను సమర్పించడంతో పాటు, ఓటరు జాబితా సవరణలపై అధికారుల నుండి అవసరమైన మార్గదర్శకాలను పొందారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ఈ విడత సవరణ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# యాప్ ద్వారా ఎరువుల కొనుగోలు సులభతరం..

- పంట బీమాతో రైతుకు ధీమా..
- ఏఓ పవన్ కుమార్...



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 11 : బండి ఆత్మకూరు మండలం పార్నపల్లి గ్రామంలో డ్రై సోయింగ్ పద్ధతిలో బిపిటి 3284 రకం మిని కిట్ల వరి సాగును మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ శనివారం పరిశీలించారు . ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. యాప్ ద్వారా యూరియా మరియు డిఏపి కొనుగోలులో రైతులకు ఓటీపీ ఇబ్బంది తొలగించడానికి బయోమెట్రిక్ పద్ధతిని ప్రభుత్వం యాప్ లో కల్పించిందని, కావున వేలిముద్ర ద్వారా ఎరువుల కొనుగోలు సులభతరంగా ఉంటుందని ఏఓ తెలిపారు. నంద్యాల జిల్లాలో యాప్ ద్వారా ఎరువుల కొనుగోలు బండి ఆత్మకూరు మండలం మొదటి స్థానంలో ఉన్నదని, ఇంకా రైతులు బయోమెట్రిక్ ద్వారా సులభతరంగా ఎరువులు కొనుగోలు చేయవచ్చని వారు తెలిపారు. దేవాదాయ భూములు నాన్ వెబ్ ల్యాండ్ మరియు ఇతర కౌలు సాగుదారులు యాప్ లో ఎరువులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

**ఖరీఫ్ పంటలకు పంట బీమా చేయించుకోవాలి**

ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలకు రైతులు తప్పని సరిగా పంటల బీమా చేయించుకోవాలని, ప్రభుత్వం 'ప్రధానమంత్రి ఫసల్ బీమా', 'వాతావరణ ఆధారిత బీమా' పథకాలకు నూతన మార్గదర్శకాలు విడుదల చేసిందని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో బీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని, పంట బీమా కొరకు ఫార్మర్ ఐడి తప్పనిసరి అని వారు సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో వరి పంట గ్రామం యూనిట్గా, మొక్కజొన్న, మినుము, కంది, మిరప పంటలు మండలం యూనిట్గా, సజ్జ, కొర్ర, ఉల్లి, ఆముదం, జొన్న పంటలు జిల్లా యూనిట్గా నిర్ధారించినట్లు ఏఓ వివరించారు. పంటల వారీగా ఎకరాకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలను ఆయన వెల్లడించారు. వరికి రూ. 800, మిరపకు రూ.2880, మొక్కజొన్నకు రూ. 660, ఉల్లికి రూ. 450, కందికి రూ.400, మినుము మరియు జొన్న పంటలకు రూ.190, సజ్జ మరియు ఆముదం పంటలకు రూ.160 చొప్పున ప్రీమియం చెల్లించి రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. వరి పంటకు ఆగస్టు 15వ తేదీ వరకు, ఇతర పంటలకు జూలై 31 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. అలాగే వాతావరణ ఆధారిత బీమా పథకం కింద వేరుశనగ, ప్రత్తి, అరటి పంటలను చేర్చినట్లు వివరించారు. ఈ పథకంలో ఎకరాకు వేరుశనగకు రూ.560, ప్రత్తికి రూ.1600 అరటికి రూ.2750 చొప్పున ప్రీమియం చెల్లించి జూలై 15వ తేదీలోగా రైతులు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలు చిరుధాన్యాలు సాగు చేయాలని, ఖచ్చితమైన బోరుబావులు ఉన్న రైతులు మాత్రమే డ్రై సోయింగ్ పద్ధతిలో వరి సాగు చేయాలని ఏఓ కోరారు. తద్వారా నీరు ఎరువులు పురుగుమందుల ఖర్చులు ఆదా చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది పుష్పలత పలువురు రైతులు పాల్గొన్నారు.

# గురు రాజా సేవలకు గుర్తింపే టీడీపీగ్లోబల్ NRI చీఫ్ గ,డాక్టర్ గురురాజా నియామకం



☛ సీనియర్ టిడిపి నేత న్యాయవాది కాకర్ల రమేష్ చౌదరి

☛ వివిధ దేశాల ఎన్నారైలు గురు రాజాకుఅభినందనలు





దొర్నిపాడు జూలై 11 పల్లె వెలుగున్యూస్ పౌరుషాల రేనాటి గడ్డ దానధర్మాలకు ,సేవలకు పేరెన్నిగన్న కోయిలకుంట్ల నివాసి గురురాజా సేవలకు గుర్తింపుగా టిడిపిఅధ్యక్షుడురాష్ట్రముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు ఆయననునియమించడంవట్ల బురారెడ్డి పల్లె గ్రామ సీనియర్ టిడిపి నాయకుడు న్యాయవాది అయిన కాకర్ల రమేష్ చౌదరి టిడిపి పార్టీ కుటుంబసభ్యు లుబురారెడ్డి పల్లె టిడిపి నాయకులు కార్యకర్తలతరపున ముఖ్యమంత్రి కి అభినందనలు తెలుపుతున్నానుఅన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, కెనడా ,యునైటెడ్ కింగ్ డమ్,ఆస్ట్రేలియ,ఆసియ, ఆఫ్రికా తదితర దేశాల్లోని ఎన్నారైలు టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు డాక్టర్ గురు రాజా నియామకాన్ని స్వాగతించి అభినందనలు తెలియజేశారు అన్నారు, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని కోరుతున్నానుఅన్నారు ప్రపంచానికి దూరంగా ఉన్నా టిడిపిపార్టీ కొరకు తెరవెనుక విశేషంగా పనిచేసిన డాక్టర్ గురు రాజా సేవలనుగుర్తించి పార్టీ అధిష్టానం ప్రవాస తెలుగు వారిలో ఆయనకున్న అనుబంధం లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ఇంత పెద్ద బ ా ద . ్ య త ్ న ం అప్పగించిందన్నారు,దశాబ్దలుగా ప్రజలకుసేవ చేస్తున్నఆయన సేవలకుగుర్తింపుగఈనియామకం అనిజిల్లా ప్రజల్లసంతోషం వ్యక్తపరిచారు అన్నారు,టీడీపీ గ్లోబల్ చీ=× చీఫ్ డాక్టర్ గురు రాజా కోవెలకుంట్ల నివాసి అని చెప్పుకోవడంమాకుచాలాగర్వకారణం గాఉందిఅన్నారు.దాదాపు30సంవత్స రాల క్రింద వృత్తి రీత్యా. అమెరిక లొ డాక్టర్ గసేవలు అందిస్తూ స్థిర పడ్డ. డాక్టర్ గురు రాజాతన మాతృ దేశం, తనకుజన్మ ఇచ్చిన ప్రాంతం. ఋణం తీర్చు కోవాలన్నా. సంకల్పం తోడాక్టర్ గురు రాజా తన బాల్య మిత్రులతో. కలిసి. గురు రాజా మిత్ర మండలి స్థాపించి.గత 30సంవత్సరాలుగ కోవెలకుంట్ల మండలం మేకాకఇతర గ్రామాలలోవందల కుటుంబాల పేద మహిళలకు వృత్తినైపుణ్యం లోశిక్షణఇచ్చి,శిక్షణతో కూడిన. అందుకు సరిపడ వస్తువులతో పాటు వారికి. ఆర్థిక సహాయంచేసి వారి కుటుంబాలఆర్థిక భివృద్ధికి చేయూత ఇచ్చిన ఘనత. డాక్టర్ గురు రాజా కె చెందుతుంది అన్నారు.ఈ కార్యక్రమం లొ టీడీపీ యువ గళం సభ్యులు. కాకర్ల శ్రీనివాస చౌదరి,లింగుట్ల రాజేష్, యమ్ రమేష్ చౌదరి హుస్సేన్ వలి, బత్తుల సురేష్, మోహన్ రావ్, వెంకట రావ్, జకూర్ హుస్సేన్, మనోహర్,కానాల హుస్సేన్ భాష, కాకర్ల సురేష్, బత్తుల పెద్దయ్య. లు డాక్టర్ గురురాజకు. శుభాకాంక్షలు తెలిపారు

# ఎస్ఐఆర్ ప్రక్రియలో జాప్యం వద్దు: కలెక్టర్ డా. ఏ. సిరి హెచ్చరిక

● లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి ● ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అసంతృప్తి ● పనుల పురోగతిపై ప్రతి 2 గంటలకోసారి నివేదికలు పంపాలని ఆదేశం





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ా×=) ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె ఈఆర్ఓ (జు=ా), ఏఈఆర్ఓ (ూజు=ా), అదనపు ఏఈఆర్ఓలతో ప్రత్యేక టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఈఎఫ్ (జుఖీ) డిజిటైజేషన్, అన్‌కలెక్టబుల్ డేటా ఎంట్రీలు, ఏఎస్‌డీడీ (ూూణణ – ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్) నమోదు తదితర పనుల పురోగతిని కలెక్టర్ నిశితంగా సమీక్షించారు.

**ప్రగతిపై కలెక్టర్ అసంతృప్తి..**

గడువు సమీపిస్తున్నప్పటికీ ఈఎఫ్ డిజిటైజేషన్, అన్‌కలెక్టబుల్ శాతం రెండింటిలోనూ ఆశించిన స్థాయిలో పురోగతి నమోదు కాకపోవడం పట్ల కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈఎఫ్ డిజిటైజేషన్ కనీసం 6 శాతం, అన్‌కలెక్టబుల్ 3 శాతం కలిపి మొత్తం 9 శాతం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. కేవలం 5.5 శాతం మాత్రమే రావడం ఏమిటని ఈఆర్ఓలను ప్రశ్నించారు. కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉన్నందున పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ (ూూణణ) కేసులను త్వరితగతిన పరిష్కరించి, వంద శాతం లక్ష్య సాధనకు ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో నేరుగా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

కర్నూలు, పాణ్యం నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి జిల్లాలో 61 నుండి 70 శాతం లోపు డిజిటైజేషన్ ప్రక్రియలో కర్నూలు పరిధిలో 154 పోలింగ్ కేంద్రాలు, పాణ్యం పరిధిలో 69 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం డిజిటైజేషన్ ప్రక్రియలో కర్నూలు 71.23 శాతం, పాణ్యం 74.90 శాతంతో వెనుకబడి ఉన్నాయన్నారు. 80 శాతం పురోగతి సాధించాల్సి ఉండగా.. జాప్యం చేయడంపై సంబంధిత అధికారులను మందలించారు. వెంటనే బీఎల్ఓ (దీూ)లను ఒకేచోట సమీకరించి, ఏఎస్‌డీడీ జాబితాల పరిశీలన, ధృవీకరణ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనుల పురోగతిపై ప్రతి 2 గంటలకు ఒకసారి నివేదికలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

**జూలై 21న డ్రాఫ్ట్ లిస్ట్ విడుదల**

ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. “జూలై 21వ తేదీన కేవలం డ్రాఫ్ట్ (ముసాయిదా) లిస్ట్ మాత్రమే పబ్లిష్ చేస్తున్నాం. అందులో ఏవైనా తప్పులు లేదా కరెక్షన్లు ఉంటే.. క్లెయిమ్స్ డ అబ్జెక్షన్స్ (సభ్యంతరాల స్వీకరణ) సమయంలో ఫారమ్‌లు సమర్పించి సవరించుకోవచ్చు” అనే విషయాన్ని బీఎల్ఓల ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. అన్ని నియోజకవర్గాల్లోనూ గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా సీనియర్ చదరంగం జట్ల ఎంపిక పోటీలు.

● ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణ రెడ్డి, డాక్టర్ రవి కృష్ణ. ● చదరంగం మేధో శక్తిని,ఏకాగ్రతను పెంచుతుంది: డాక్టర్ రామకృష్ణారెడ్డి. ● ఈనెల 18,19వ తేదీలలో నంద్యాలలో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తున్నాం: ● జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా సీనియర్ చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం మేధో శక్తిని,ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందని అన్నారు.తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని, క్రీడలు విద్యార్థులలో గెలుపు ఓటములను స్వీకరించే మనస్తత్వం, ఓటమి చెందాక తిరిగి గెలవాలనే పట్టుదల పెంచుతాయని అన్నారు. నిరంతర సాధన ద్వారా చదరంగంలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని కోరారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు నంద్యాల లో ఈనెల 18,19వ తేదీలలోజరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి,డాక్టర్ రవి కృష్ణ చెస్ బోర్డుపై పావులు కదిపి చదరంగం పోటీలను లాంచనంగా ప్రారంభించారు. 200 మంది పైగా చదరంగం క్రీడాకారులు జిల్లా నలుమూలల నుండి వచ్చి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్, మేడా చంద్రశేఖర్, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు,చెస్ సంఘం సంయుక్త కార్యదర్శులు ఇమామ్, రాజా రమేష్ చక్రవర్తి, కోచ్ లు అరుణ్, మాలిక్ భాషా, సురేష్, అధిక సంఖ్యలో క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బండి ఆత్మకూరులో పారిశుద్ధ్య పనులు





బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 11 : బండి ఆత్మకూరులో శనివారం పారిశుధ్య పనులను చేపట్టారు. వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామం నుండి ప్రత్యేకంగా 13 మంది పారిశుధ్య కార్మికులను లభించి గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. మఠంపేట, శివాలయం, ఎర్రగుంట్ల రాస్తా ప్రాంతాలలో చాలా కాలం నుండి డ్రైనేజీలలో పూడిక పేర్కొని పోయింది. అడపా దడపాగా కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తు ఉండటంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. కాల్వలలో మురుగునీటి ద్వారా దోమలు వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని అధికారులు గుర్తించారు. రెండు రోజుల క్రితం ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, ఇన్చార్జి కార్యదర్శి వెంకట చౌడయ్య ఈ ప్రాంతాలను పరిశీలించారు. శనివారం పారిశుద్ధ్య కార్మికులను రప్పించి కాలువలను శుభ్రం చేసే పనులకు పూనుకున్నారు. మండల తాసిల్దార్, బండి ఆత్మకూరు గ్రామ స్పెషల్ ఆఫీసర్ పద్మావతమ్మ శివాలయం ప్రాంతాన్ని సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చాలా రోజుల నుండి చేరుకొని పోయి ఉన్న కాలువలను అధికారులు పట్టించుకోని శుభ్రం చేయడం పట్ల ప్రజలు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ఎస్ఐఆర్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నంద్యాల పట్టణంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం ఎం.ఎస్.



నగర్‌లో జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 111 నుంచి 115 వరకు, అలాగే 125 పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో చేపడుతున్న డిజిటలైజేషన్ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఎన్యూమరేషన్ ఫారమ్‌ను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనలకు అనుగుణంగా డిజిటలైజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి వివరాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తనిఖీ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శేషన్న, నంద్యాల అర్బన్ తహశీల్దార్ శ్రీనివాసులుతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో క్రికెట్ కిట్లను క్రీడాకారులకు పంపిణీ చేసిన డాక్టర్ ఏ.వి. రామ సుబ్రమణ్యం..


ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 11 పల్లె వెలుగు ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ క్రీడా మైదానంలో



శనివారం డాక్టర్ ఏ.వి.ఆర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆర్ ఆర్ అకాడమీ క్రీడాకారులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాము సుబ్రమణ్యం మాట్లాడుతూ నా తండ్రి గారైన దివంగత అమరావతి లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం ఆర్.ఆర్. అకాడమీ క్రీడాకారులకు శనివారం ప్రభుత్వ క్రీడ మైదానం లో క్రికెట్ కిట్టులను పంపిణీ చేయడం జరిగింది. అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో కాకుండా ఇంటర్నేషనల్ లెవెల్ లో ఆళ్లగడ్డకు గుర్తింపు తేవాలని క్రీడాకారులకు, డాక్టర్ రామ సుబ్రమణ్యం కోరారు. అనంతరం ఆర్ఆర్ అకాడమీ నిర్వహించిన ఫ్రెండ్లీ ఓల్డ్ ఫ్రెండ్స్ క్రికెట్ మ్యాచ్ లో సీనియర్ క్రికెట్ క్రీడాకారులు ఏ వి ఆర్ సుబ్రహ్మణ్యం, వినోద్ కుమార్, సుబ్బారెడ్డి, డాక్టర్ సుదర్శన్ రెడ్డి,భువన శేఖర్ బ్రహ్మం,కోచ్ సుబ్బరాయుడు, క్రీడాకారులు క్రికెట్ మ్యాచ్ లో పాల్గొన్నారు.

# మన ఓటు మన హక్కు.. ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం

**ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి**





ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ఆలూరు నియోజకవర్గం ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో, ఆలూరు పట్టణం నందు బూత్ నెంబర్ 133,134,135 బూత్ లో ఎస్ ఐ ఆర్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి. ఈరోజు ఆలూరు మండలం మొలగవల్లి గ్రామం ఆలూరు లో జరుగుతున్న వెరిఫికేషన్ ప్రక్రియను ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి గ్రామానికి సంబంధించిన నాయకులు కార్యకర్తలతో కలిసి పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి, వెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మాట్లాడుతూ ప్రతి ఓటు ఎంతో విలువైనది ప్రతి ఓటరు తమ ఓటు వివరాలను తప్పనిసరిగా పార్టీ లు మీమీ బి ఎల్ ఓ ల సహకారంతో అవసరమైన వెరిఫికేషన్ పూర్తి చేయాలి. ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. ఓటు హక్కును కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలనీ పిలుపునిచ్చారు. పార్టీ అందుబాటులోకి తీసుకువచ్చిన మై బూత్ మై ఓటర్ యాప్ సూచించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల ఓట్లు తొలగించకుండా బిఎల్ఎ లు అప్రమత్తంగా ఉంటూ ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందజేయడంలో అలసత్వం ప్రదర్శించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని బిఎల్ఎ లకు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తెలిపారు. బి ఎల్ ఎ లకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సందేహాలను నివృత్తి చేసి వారికి తగిన సూచనలు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# వెదుర్లు తరలిస్తున్న వాహనం స్వాధీనం.




రుద్రవరం.పల్లె వెలుగు: రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలో బొలెరో వాహనంలో వెదుర్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు రేంజి ఆఫీసర్ ముర్తుజావలి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 10.7.2026 వ తేదీన బొలెరో వాహనంలో అక్రమంగా వెదుర్లు తరలిస్తున్నారని రాబడిన సమాచారం మేరకు సబ్ డి ఎఫ్ ఓ, ఎస్ బి శ్రీనివాసరెడ్డి వారి ఆదేశాల మేరకు యస్. ముర్తుజావలి అటవీ క్షేత్రాధికారి రుద్రవరం వారి సూచనల మేరకు అటవీ అధికారులు డబ్ల్యూ కొత్తపల్లి రస్తా సమీపంలో అక్రమముగా వెదురు కర్రలను తరలిస్తున్నటువంటి బొలెరో వాహనమును స్వాధీనము చేసుకునీ గాజులపల్లి కి చెందిన ముద్దాయి షేక్ నందిపల్లి మదర్ సాహెబ్ పై అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయడమైనది. ఈ దాడుల్లో సెక్షన్ ఆఫీసర్లు మాబుఖాన్ . విజయ వర్ధన్ . మద్దిలేటి స్వామి బీట్ ఆఫీసర్లు సురేంద్ర గౌడ్ నాగేష్ లు ఉన్నారు.

# పాపారెడ్డి పురుషోత్తం రెడ్డికి పితృ వియోగం

- చికిత్స పొందుతూ పాపా రెడ్డి రాజారామ్ మృతి
- రేపు జమీన్ కొత్తపాలెంలో అంత్యక్రియలు



(వాకాడు, జూలై 11, శనివారం) : తిరుపతి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు పాపారెడ్డి పురుషోత్తమ రెడ్డికి పితృ వియోగం కలిగింది. పాపారెడ్డి రాజారామి రెడ్డి శనివారం నెల్లూరు హాస్పిటల్లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన పార్థీవ దేహాన్ని స్వగ్రామమైన జమీన్ కొత్తపాలెం గ్రామానికి తరలించారు. . ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాపారెడ్డి రాజారామి రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వాకాడు మండల ప్రజలు మనసారా కోరుకుంటున్నారు. అన్ని పార్టీల రాజకీయ నాయకులు, సన్నిహితులు రాజారామ్ రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. అలాగే పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, వాకాడు మండల టీడీపీ నాయకులు కల్లూరు హరీష్ బాబు నాయుడు రాజారామి రెడ్డి పార్ధివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో బంగారు గొలుసుల

# చోరీ కేసు ఛేదించిన ఫోర్త్ టౌన్ పోలీసులు

- తమిళనాడుకు చెందిన ఇద్దరు కిలాడీ మహిళల అరెస్ట్
- 6.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం: సీఐ విక్రమసింహ వెల్లడి



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ వేదికగా ప్రయాణికులను భయాందోళనలకు గురిచేసిన వరుస బంగారు గొలుసుల చోరీ కేసులను నాల్గవ పట్టణ (ఫోర్త్ టౌన్) పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. అంతర్రాష్ట్ర దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. లక్షలాది విలువచేసే సుమారు 6.5 తులాల బరువున్న రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోర్త్ టౌన్ సీఐ విక్రమసింహ కేసు వివరాలను వెల్లడించారు.

**వరుస దొంగతనాలతో కలకలం:**

గత నెల జూన్ 11వ తేదీన గిద్దలూరుకు వెళ్లేందుకు కర్నూలు బస్ స్టేషన్‌లో బస్సు కోసం వేచి ఉన్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు అపహరించారు. అదేవిధంగా, విధులకు హాజరయ్యేందుకు బస్ స్టేషన్‌కు వచ్చిన పెద్దపాడుకు చెందిన ఓ బ్యాంకు ఉద్యోగిని మెడలోని బంగారు గొలుసును కూడా పక్కా ప్లాన్‌తో దొంగిలించారు. బాధితుల ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగిన ఫోర్త్ టౌన్ పోలీసులు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

**సీసీ కెమెరాల నిఘా.. కుప్పంలో పట్టుబడ్డ నిందితులు:**

దర్యాప్తులో భాగంగా పోలీసులు బస్ స్టేషన్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. సాంకేతిక ఆధారాల సాయంతో ఈ చోరీలకు పాల్పడింది తమిళనాడు రాష్ట్రం, జోలార్పేటకు చెందిన భాగ్య, హన్నమ్మలుగా గుర్తించారు. నిందితులు ప్రస్తుతం బెంగళూరు, కుప్పం ప్రాంతాల్లో సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

**పోలీసుల ప్రత్యేక వ్యూహం:**

కర్నూలు ఫోర్త్ టౌన్ సీఐ విక్రమసింహ నేతృత్వంలో ఎస్ఐ శరత్ కుమార్, పోలీసు సిబ్బంది సుబ్బరాయుడు, మురళిలతో కూడిన ప్రత్యేక బృందం తక్షణమే కుప్పంకు పయనమైంది. కుప్పంలోని ప్యాలెస్ రోడ్ వద్ద నిందితులు భాగ్య, హన్నమ్మలను వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీకి గురైన 6.5 తులాల ఆభరణాలను రికవరీ చేశారు. వరుస దొంగతనాల కేసులను అతి తక్కువ కాలంలోనే ఛేదించి, నిందితులను పట్టుకున్న ప్రత్యేక బృందాన్ని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

# ఆదిత్యనగర్‌లో వ్యభిచార గృహంపై పోలీసుల దాడి: ముగ్గురు అరెస్ట్

- ఇద్దరు నిర్వాహకులు, ఒక విటుడు పట్టివేత
- నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహ వెల్లడి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నగరంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై కర్నూలు నాల్గవ పట్టణ (ఫోర్త్ టౌన్) పోలీసులు ఉక్కుపాదం మోపారు. శనివారం ఉల్చాల రోడ్ సమీపంలోని ఆదిత్యనగర్‌లో నిర్వహిస్తున్న ఒక వ్యభిచార గృహంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఇద్దరు నిర్వాహకులతో పాటు ఒక విటుడిని రంగులరాట్నంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఫోర్త్ టౌన్ సీఐ విక్రమసింహ పత్రికలకు వెల్లడించారు.

**నమ్మదగిన సమాచారంతో దాడులు:**

ఆదిత్యనగర్ పరిసరాల్లో కొద్దిరోజులుగా గుట్టుగా అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచిన ఫోర్త్ టౌన్ పోలీసులు, శనివారం వ్యూహాత్మకంగా సదరు గృహంపై దాడి చేశారు. ఈ దాడుల్లో వ్యభిచార గృహాన్ని నడుపుతున్న కర్నూలుకు చెందిన ప్రధాన నిర్వాహకులు వంశీకృష్ణ, రామకృష్ణలతో పాటు, అక్కడకు వచ్చిన ఆదోనికి చెందిన విటుడు భరత్‌లను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



**కేసు నమోదు.. రిమాండ్‌కు తరలింపు:**

అసాంఘిక నిర్వాహకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై సంబంధిత చట్టాల (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్) కింద గట్టి కేసులు నమోదు చేశారు. నిందితులను వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు సీఐ విక్రమసింహ తెలిపారు. నగరంలో ఇలాంటి అసాంఘిక, చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడితే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

# ఖరీఫ్-2026 సాగును వేగవంతం చేసి లక్ష్యాలను అధిగమిద్దాం.

- రైతులకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలి.
- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలో ఖరీఫ్-2026 సీజన్ వ్యవసాయ పనులు సజావుగా కొనసాగుతున్నాయని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సేవలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని శనివారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు.

జిల్లాలో ఖరీఫ్-2026 సీజన్‌లో మొత్తం 2,20,230 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయడమే లక్ష్యంగా నిర్ణయించగా, జూలై 10 నాటికి 64,535 హెక్టార్లలో సాగు పూర్తై, గత ఖరీఫ్ ఇదే కాలంతో పోలిస్తే గణనీయమైన పురోగతి నమోదైందన్నారు. గత ఏడాది ఇదే సమయానికి 40,785 హెక్టార్లలో మాత్రమే సాగు ఉండగా, ఈ ఏడాది దాదాపు 23,750 హెక్టార్లు అధికంగా సాగు నమోదవడం రైతుల ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.

వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు కేటాయించిన 54,488 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులలో, జూలై 11 నాటికి 49,783 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 35,560 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువుల నిల్వలు ఉండగా, అవసరానికి అనుగుణంగా సరఫరా కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 14,223 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులను రైతులు వినియోగించుకున్నారని తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో 933 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ గోదాములలో 17,279 మెట్రిక్ టన్నులు, రిటైల్/ హోల్ సేల్ విక్రయ కేంద్రాలలో 17,348 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువుల నిలువలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

రైతులు ఇబ్బందులు పడకుండా బయోమెట్రిక్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ఎరువులను నిర్ణీత ధరలకే విక్రయించేలా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, అధిక ధరలకు విక్రయించడం, అక్రమ నిల్వలు, నకిలీ ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాలు, ఎరువుల విక్రయ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి కొరత లేకుండా అవసరమైన నిల్వలు ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎవరైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టించిన లేదా మళ్ళి0పులకు పాల్పడినా ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం వారి లైసెన్సులు రద్దుచేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో అత్యధికంగా మొక్కజొన్న 20,039 హెక్టార్లు, కంది 18,252 హెక్టార్లు, మినుము 8,370 హెక్టార్లు, సోయాబీన్ 6,004 హెక్టార్లు, పత్తి 5,205 హెక్టార్లు విస్తీర్ణంలో సాగు జరిగినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే వేరుశనగ 3,131 హెక్టార్లు, సజ్జ 1,901 హెక్టార్లు, ఆముదం 1,050 హెక్టార్లు, కొర్ర 279 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 152 హెక్టార్లు, వరి 118 హెక్టార్లు, చెరకు 18 హెక్టార్లు, పెసలు 16 హెక్టార్లలో సాగు నమోదైందన్నారు.

వర్ష పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని ఆమె సూచించారు. ఖరీఫ్ సీజన్‌ను విజయవంతం చేయడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

# జూలై 14లోగా ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించాలి.





**● ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి. ● అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి. ● జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. జూలై 14తో ఈ ప్రత్యేక కార్యక్రమం ముగియనున్నందున మిగిలిన రోజులను సద్వినియోగం చేసుకొని ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆమె కోరారు.
శనివారం వీడియో సందేశం ద్వారా జిల్లా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో ప్రస్తుతం 14,05,443 మంది ఓటర్లు నమోదై ఉన్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి రెండు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందజేస్తున్నారని తెలిపారు. ఒక ఫారమ్‌ను ఓటరు స్వీకరించినట్లు అక్నాలెడ్జ్ చేయగా, రెండవ ఫారమ్‌ను అవసరమైన వివరాలతో పూరించి తిరిగి బూత్ లెవెల్ అధికారులకు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. అందిన ఫారమ్‌లన్నింటినీ డిజిటలైజ్ చేసి తుది ఓటరు జాబితా తయారీకి వినియోగిస్తామని తెలిపారు. ఫారమ్‌ను తిరిగి సమర్పించని పక్షంలో సంబంధిత ఓటరు పేరు రాబోయే డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌లో నమోదు కాకపోయే అవకాశం ఉందని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 10,90,722 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి తిరిగి అందగా వాటిని విజయవంతంగా డిజిటలైజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి, అలాంటి 55,449 ఫారమ్‌లను కూడా డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా 2,59,272 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి అందాల్సి ఉందన్నారు. మిగిలిన ఫారమ్‌ల సేకరణను వేగవంతం చేసేందుకు శనివారం, ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.
*జూలై 14 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఓటరు బాధ్యతగా స్పందించి తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌ను వెంటనే సంబంధిత బూత్ లెవెల్ అధికారికి అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, బూత్ లెవెల్ ఏజెంట్లు, అధికారులు సమిష్టిగా సహకరించాలని కోరారు.*
పారదర్శకమైన, సమగ్రతతో కూడిన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి ఓటరి భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు.

# రైతులందరూ పంటలకు బీమా చేయించుకోవాలి.

గడివేముల పల్లె వెలుగు పత్రిక




ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని గడివేముల మండల వ్యవసాయ అధికారి జి. కే. పవన్ కుమార్ రైతులతోఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ భీమా మరియు వాతావరణ ఆధారిత భీమా ను వివిధ పంటలకు వర్తింప చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం లో వరి గ్రామం యూనిట్ గా, మొక్కజొన్న, మినుము, కంది, మిరప మండలం యూనిట్ గా, సజ్జ, కొర్ర, ఉల్లి, ఆముదం, జొన్న జిల్లా యూనిట్ గా ఉన్నదని, వరికి ఎకరాకు 800/–, మొక్కజొన్న కు 660/–, కంది కి 400/– , మినుము మరియు జొన్నకు 190/–, సజ్జ మరియు ఆముదం పంటలకు 160/– , ఉల్లికి 450/– , మిరపకు 2880/– ప్రీమియం చెల్లించి రైతులు పంటల భీమా పథకం లో నమోదు చేసుకోవచ్చునని, అలాగే, వరికి ఆగస్టు 15వ తేదీ వరకు మరియు ఇతర పంటలకు జూలై 31 వరకు గడువు ఉన్నదని తెలిపారు. అలాగే వాతావరణ ఆధారిత భీమా పథకం లో వేరుశనగ, ప్రత్తి మరియు అరటి పంటలు పొందు పరచటం జరిగిందని , వేరుశనగ కు ఎకరాకు 560/–, ప్రత్తి కి 1600/– మరియు అరటికి 2750/– రూపాయలు ప్రీమియం గా చెల్లించి జూలై 15 వ తేదీలోగా రైతులు నమోదు చేసుకోగలరని తెలిపారు.ఇంకా పూర్తి వివరాలకు రైతులు వారి సమీపంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని కలవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పంటల బీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని రైతులకు రైతులకు తెలియజేస్తున్నాము.
గని గ్రామంలో పంటల బీమా మీద పంట బీమా ఇన్సూరెన్స్ సిబ్బందితో కలిసి రైతులకు పంట బీమా పథకం మీద అవగాహన కల్పించడం జరిగింది.

**లిసబ్సిడీ లో మినుము విత్తనాల**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించడానికి పల్స్ మిషన్లో భాగంగా ప్రభుత్వం సబ్సిడీ పై విబిఎన్ 9 రకం మినుములు పంపిణీ చేయడం జరుగుతుందని, ఇందుకు మన మండలనికి 40 క్వింటాలు కేటాయించడం జరిగిందని, వీటిని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, పూర్తి ధర: కిలో 129.5/–, సబ్సిడీ 60/– , రైతు వాటా: 69.5/– చెల్లించి మినుములు పొందగలరని వ్యవసాయ అధికారి తెలిపారు.ఎరువుల సరఫరా
ఏపీ ఏ ఐ ఎం ఎస్ యాప్ ద్వారా రైతులకు ఎరువులు సరఫరా జరుగుతుంది. ఓటిపి ద్వారా మాత్రమే కాకుండా ఫేస్ మరియు బయోమెట్రిక్ ఆథెంటికేసన్ ద్వారా ఎరువులు ఇవ్వడం జరుగుతుంది. దీని ద్వారా రైతులు సులభంగా ఎరువులు పొందవచ్చు.ప్రాథమిక వ్యవసాయ కేంద్రం గడివేముల, రైతు సేవా కేంద్రాలు మరియు ప్రైవేటు దుకాణాల వద్ద తగినంత యూరియా, డి ఏ పి మరియు ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందిఅని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరం.

**☛అమరావతి నగర్ వార్డుకు పెద్ద ఎత్తున సియం రిలీఫ్ ఫండ్.**

**☛అమరావతి నగర్ వార్డ్ ఇంచార్జ్ మాజీ కౌన్సిలర్ లలితమ్మ.**





ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డు అమరావతి నగర్ కాలనీకి దాదాపు 5లక్షల 90వేల రూపాయలు సియం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందని అమరావతి నగర్ మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ తెలిపారు.ఈరోజు ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయములో వివిధ రోగాలకు సంబంధించి సొంత డబ్బులతో వైద్య చేయించుకున్న ఆదోని నియోజకవర్గ ప్రజలు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి అప్లై చేసుకోవడం జరిగిందని లలితమ్మ వివరించారు. అందులో భాగము ఈరోజు 68 మంచిది చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టి ఎమ్మెల్యే పార్థసారథి చేతుల మీదుగా అందచేయడం జరిగిందని. అందులో భాగముగానే మా అమరావతి నగర్ వార్డుకు సంబంధించిన ఆరుమందికి 5 లక్షల 90వేల రూపాయల చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని లలితమ్మ తెలిపారు.అత్యవసర సమయాలలో సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న ప్రజలు హాస్పిటల్ నుండి అన్ని రసీదులు తీసుకుని ఎమ్మెల్యే కార్యాలయంలో అందచేస్తే ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించి డబ్బులు వచ్చేల ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి ప్రయత్నం చేస్తారని అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది అప్పులు చేసుకుని వైద్యం చేయించుకున్న వారికి ఎంతో మేలు చేస్తుందని లలితమ్మ సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు ఉపేంద్ర, పరుశురాం, మహాదేవ, నాగార్జున,బోయచంద్ర, దుర్గా ప్రసాద్ మొదలైన వారు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత

**నకిలీ ఏపీకె ఫైల్స్, నిషేధిత లోన్ యాప్స్ మరియు సరికొత్త సైబర్ మోసాలపై నంద్యాల జిల్లా పోలీస్ శాఖ హెచ్చరిక**

**● "అప్రమత్తతే సైబర్ నేరాలకు ఏకైక నివారణ.... మీ సైబర్ భద్రత -- మా బాధ్యత...." ● జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.
ఇటీవలి కాలంలో సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు సరికొత్త పద్ధతుల్లో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రజలందరూ సైబర్ భద్రత పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునిల్ షోరాణ్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా నకిలీ ఏపీకె ఫైల్స్, అనధికార లోన్ యాప్స్, అధిక లాభాల ఆశ చూపించడం (వాట్సాప్ ,ఇంస్టాగ్రామ్) మరియు ఇతర డిజిటల్ మోసాల పట్ల కింది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడమైనది.

**1.నకిలీ ఏపీకే ఫైల్స్ తీవ్ర ముప్పు.**

సైబర్ నేరగాళ్లు వాట్సాప్, టెలిగ్రామ్ లేదా ఎస్ఎంఎస్ ల ద్వారా ఆర్ టి ఓ ఈ–చలనా, ఎస్బిఐ -రివార్డ్స్, యు నో–అప్డేట్ ,వెడ్డింగ్ ఇన్విటేషన్ లింకులు పంపిస్తారు జాగ్రత్త.
ఈ లింకుల ద్వారా డౌన్‌లోడ్ అయ్యే ఫైల్స్ మీ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయితే, మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ (ఓటిపి) లు మరియు వ్యక్తిగత డేటా మొత్తం సైబర్ ముఠాల చేతుల్లోకి వెళ్ళిపోతుంది.
గూగుల్ ప్లే స్టోర్ ( గూగుల్ ప్లే స్టోర్) లేదా ఆపిల్ యాప్ స్టోర్ ( యాపిల్ యాప్ స్టోర్) మినహా, ఇతర మూలాల ( అన్ నౌన్ సోర్సెస్) నుండి ఎటువంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు.
2.నిషేధిత లోన్ యాప్స్ (ఫేక్ లోన్ ఆప్స్) -- ఊబిలో పడకండి. తక్కువ వడ్డీకే, ఎటువంటి పత్రాలు లేకుండా తక్షణమే లోన్ ఇస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను నమ్మవద్దు. ఆర్‌బీఐ (ఆర్.బి.ఐ) గుర్తింపు లేని నిషేధిత లోన్ యాప్స్ లు మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ సమాచారాన్ని దొంగిలిస్తాయి. ఆ తర్వాత మీ నకిలీ ఫోటోలను సృష్టించి, మీ బంధువులకు పంపుతామని బెదిరిస్తూ భారీగా డబ్బులు వసూలు (బ్లాక్‌మెయిల్) చేస్తారు అప్రమత్తంగా ఉండండి.
అత్యవసరమైతే కేవలం ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలను మాత్రమే సంప్రదించండి

**3.ప్రస్తుతం జరుగుతున్న ఇతర సైబర్ నేరాలు.**

డిజిటల్ అరెస్ట్ సిబిఐ , ఈడీ , పోలీస్ లేదా కొరియర్ సంస్థల అధికారులమంటూ వీడియో కాల్స్ చేసి, మీ పైన కేసులు ఉన్నాయని మానసికంగా భయపెట్టి, లక్షలు వసూలు చేస్తారు. చట్టంలో ఎక్కడా 'డిజిటల్ అరెస్ట్' అనే విధానం లేదు. ఎవరైనా డిజిటల్ అరెస్ట్ మోసానికి గురి అయితే ముందుగా పోలీస్ సహాయం కొరకు 112,100 నంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చు.

**ఇన్వెస్ట్‌మెంట్ టాస్క్ మోసాలు:**

పార్ట్–టైమ్ జాబ్స్, యూట్యూబ్ వీడియోలకు లైక్ కొడితే డబ్బులు, క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల పేరుతో టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా లక్షల రూపాయలు దోచుకుంటున్నారు.

**జిల్లా పోలీస్ శాఖ వారి ముఖ్య సూచనలు:**

1బ్యాంక్ అధికారులు, పోలీసులు ఎప్పుడూ ఫోన్ లలో మీ ఓటిపి, ఏటీఎం పిన్, లేదా పాస్‌వర్డ్‌లను అడగరని గ్రహించండి.2 తెలియని వ్యక్తుల నుండి వచ్చే వీడియో కాల్స్ (ముఖ్యంగా వాట్సాప్ లో) ఎత్తకండి. 3 ఏదైనా లింక్ క్లిక్ చేసే ముందు అది నిజమైనదా కాదా అని ఒకటికి రెండుసార్లు సరిచూసుకోండి. ముఖ్య గమనిక ఏవైనా సైబర్ మోసానికి గురైతే లేదా మీ చుట్టుపక్కల వారు సైబర్ మోసానికి గురైతే, మొదటి 24 గంటల (గోల్డెన్ అవర్ ఏ) లోపు ఫిర్యాదు చేయండి. జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కాల్ చేయండి లేదా ఒఒఒ.ఎంఎవతీఎతీఅఎవ.ర్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సందర్శించండి.లేదా మీ సమీపంలోని పోలీస్ స్టేషన్ లేదా నంద్యాల జిల్లా సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించండి.

# ఆళ్లగడ్డలో నారా లోకేష్ పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమీక్ష



ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 11 పల్లె వెలుగు ఈ నెల 15వ తేదీన ఆళ్లగడ్డకు విచ్చేయనున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్వయంగా పరిశీలించారు. రాష్ట్ర మంత్రి లోకేష్ బృందం సభ్యులు, ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు నాగరాజారావు, బివి రమణ మరియు సంబంధిత అధికారులతో కలిసి పర్యటన రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. సమావేశ వేదిక ఏర్పాటు, ప్రజల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, కార్యక్రమం విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సూచించారు. ప్రతి ఏర్పాటును ముందుగానే పూర్తి చేసి, పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు, పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు

## డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రజల సహకారం అవసరం ! కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె




విజయవాడ జులై 11(పల్లె వెలుగు దినపత్రిక); డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు.జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా శు క్రవారం విజయవాడ నగరంలోని మాచవరం ప్రాంతంలో జిల్లా మలేరియా అధికారి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు ఇంటింటి అవగాహన కార్యక్రమం,డెంగ్యూ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబం తమ ఇళ్లు, పరిసరాలు, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిల్వ నీరు దోమల వ్యాప్తికి ప్రధాన కారణమని, నీటి పాత్రలను తరచూ ఖాళీ చేసి శుభ్రం చేయాలని ప్రజలకు సూచించారు. డెంగ్యూ, మలేరియా నివారణలో వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా విభాగం సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే ఈ వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జులై 14లోపు గణన పత్రం సమర్పించండి - ఓటర్లకు కొత్త కొండబాబు పిలుపు

జగ్గంపేట, జూలై 11 (పల్లె వెలుగు దినపత్రిక) :- అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు పిలుపునిచ్చారు. జగ్గంపేటలో శుక్రవారం బూత్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, బిఎల్ఓలు, బిఎల్ఏలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ-2026లో భాగంగా, ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే జులై 14లోపు గణన పత్రం సమర్పించడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గణన పత్రం సమర్పించకపోతే భవిష్యత్తులో ఓటరు జాబితాలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఇంకా ఫారం సమర్పించని వారు బిఎల్ఓలను, గ్రామ వార్డు సచివాలయాలను లేదా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జిలు వేములకొండ జోగారావు, మారిశెట్టి గంగ, బూత్ ఇన్చార్జిలు కింగం రామకృష్ణ, కొండ్రోతు రమణ, బిఎల్ఏ చెలికాని హరిగోపాల్, బిఎల్ఓలు చాందిని, కృష్ణ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు



## పలువురి కుటుంబాలను పరామర్శించిన టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్





గండేపల్లి, జూలై 11 (పల్లె వెలుగు దినపత్రిక) :- జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కందుల చిట్టిబాబు తల్లి కందుల సుభద్రమ్మ ఇటీవల మరణించిన నేపథ్యంలో, శనివారం జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ గండేపల్లి మండలం జెడ్.రాగంపేటలోని వారి స్వగృహానికి వెళ్లి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలో పలువురి మరణంతో విషాదంలో ఉన్న కుటుంబాలను జ్యోతుల నవీన్ పరామర్శించి ఓదార్చారు. మురారి గ్రామానికి చెందిన క్లస్టర్ ఇంచార్జ్ జాస్తి వసంత్ పెద్ద తండ్రి జాస్తి రాధాకృష్ణ తల్లి మరణించగా, వారి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అలాగే జగ్గంపేట మండలం రాజపూడిలో కందుల నరసింహారావు, అదే గ్రామానికి చెందిన టిడిపి మహిళా కార్యకర్త మారిశెట్టి సింగరమ్మ భర్త రామకృష్ణ, సీతారాంపురం గ్రామంలో గల్ల నాగరాజు మరణించడంతో వారి కుటుంబాలను కలిసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షుడు జీనుమణి బాబు, పాండ్రంకి రాంబాబు, జిల్లా అధికార ప్రతినిధి రేఖా బుల్లి రాజు, జాస్తి వసంత్, కందుల వినయ్, గనిశెట్టి సన్యాసిరావు, బత్తుల వెంకన్న, గల్లా శ్రీను, గల్లా బాబ్జి పాల్గొన్నారు

## ఆస్ట్రేలియాలో ప్రధాని మోదీతో భేటీ అయిన పిఠాపురం జనసేన నాయకుడు శశి యాదవ్ !



పిఠాపురం జూలై 11(పల్లె వెలుగు దినపత్రిక)ఆస్ట్రేలియాలో జరిగిన 'ఎకనామిక్ రోడ్ మ్యాప్ బిజినెస్ రిసెప్షన్'లో పిఠాపురానికి చెందిన జనసేన నాయకుడు, ఎన్ఆర్ఐ శశి యాదవ్ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను, భవిష్యత్తు ప్రణాళికలను ప్రధానితో చర్చించారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రధాని మోదీకి వివరించగా, దేశాభివృద్ధి లో ప్రవాస భారతీయులు అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. ప్రధానిని కలవడం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులో భారత్-ఆస్ట్రేలియా దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని శశి యాదవ్ పేర్కొన్నారు. ఆయనకు రాజకీయ ప్రముఖులు, పిఠాపురం నియోజకవర్గ ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు

# రైతుల సంక్షేమం -- హమాలీల అభ్యున్నతే మా లక్ష్యం.

- ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి వాల్మీకి
- ఆదోని మార్కెట్ యార్డ్ సమగ్ర అభివృద్ధికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు
- రైతులకు ఆధునిక వ్యవసాయంపై ప్రతి నెల అవగాహన సదస్సులు.





ఆదోని (పల్లె వెలుగు): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆదోని శాసనసభ్యులు డా. పీవీ పార్థసారథి వాల్మీకి పేర్కొన్నారు.శనివారం ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకమండలి సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి వాల్మీకి ముఖ్య అతిథిగా హాజరై, పాలకమండలి సభ్యులతో మార్కెట్ యార్డ్ అభివృద్ధి, రైతులు, హమాలీల సంక్షేమంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులతో పాటు మార్కెట్ యార్డ్‌లో పనిచేస్తున్న హమాలీల అభ్యున్నతికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను ఆధునికీకరించి, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు సుమారు రూ.10 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఇందులో భాగంగా ప్రతి నెల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు.అదేవిధంగా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంట ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు ప్రభుత్వ కొనుగోలు అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాలకమండలి సమావేశంలో అజెండాలోని వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు. మార్కెట్ కమిటీ ఆదాయం--వ్యయం, పెన్షన్ నిధుల జమ, మార్కెట్ నిధుల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, షాపుల అద్దెల వసూళ్లు, ట్రేడింగ్ లైసెన్సుల మంజూరు, లైసెన్సుల పునరుద్ధరణ, కమిషన్ ఏజెంట్ లైసెన్సులు, పెండింగ్ బకాయిల వసూళ్లు తదితర అంశాలపై చర్చించి అవసరమైన తీర్మానాలను పాలకమండలి ఆమోదించింది.రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యతగా, మార్కెట్ యార్డ్ అభివృద్ధి విషయంలో పారదర్శకతతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి వాల్మీకి పాలకమండలి సభ్యులకు సూచించారు.ఈ సమావేశంలో ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి శారద, వైస్ చైర్మన్ ఆదూరి విజయ్ కృష్ణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి గోవిందు, పాలకమండలి డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముందు నీ పార్టీ పరిస్థితి ఏంటో చూసుకో..

- వైసీపీ నాయకుడు మురహరి రెడ్డిపై ,
- టీడీపీ నాయకులు ఆగ్రహం




నందవరం పల్లె వెలుగు జూలై 11 నందవరం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కర్నూలు జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు భాస్కర్ల చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు కాసీంవలి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసిపి నాయకుడు మురహరి రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ముందు నీవు ఏ వర్గంలో ఉన్నావో ఏ పార్టీలో ఎప్పుడు మారుతున్నావో తెలుసుకొని మాట్లాడాలని మండిపడ్డారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి పార్టీలకు అతీతంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలకు అన్ని రకాలుగా సేవలు అందిస్తూ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఇది చూసి ఓర్వలేక అనవసర ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడపాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పూటకు పార్టీ మారే వ్యక్తులు కూడా నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ముందు మీ వైసీపీ పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలని సూచించారు. తెలుగుదేశం పార్టీలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతా ఉందని, మా గురించి ఆలోచించకుండా మీ పార్టీ గురించి ఆలోచించుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సోమల గూడూరు వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి , బందె నవాజ్, మల్లెల ఆల్ ఫ్రెండ్ రాజు , సత్య రెడ్డి టిడిపి నాయకులు పాల్గొన్నారు

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ

*ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి*







నందవరం పల్లె వెలుగు జూలై 11 నందవరం మండల కేంద్రంలో నిర్వహించిన భారత రాజ్యాంగ శిల్పి, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవంలో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ఘనంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందవరం మండలంలోని గ్రామ ప్రజలు, యువత ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు. ముందుగా మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి భారీ ర్యాలీలో పాల్గొంటూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక కార్యక్రమాల నడుమ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్త మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం, సమానత్వం, విద్య మరియు అణగారిన వర్గాల సాధికారతకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడని, అందరివాడని కొనియాడారు. రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించే శక్తివంతమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యను ఆయుధంగా చేసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి మరియు ప్రతి వర్గం సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, డాక్టర్ అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణ దిశగా ప్రజలందరూ కలిసి ముందుకు సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నందవరం మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మరియు సభ్యులు, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, ఏఎంసీ చైర్మన్, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్, మార్కెట్ యార్డు డైరెక్టర్, డిసేబుల్డ్ వెల్ఫేర్ ఒ మల్లెల ట్రస్ట్ అధినేత, టీడీపీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, నందవరం మండలం మరియు వివిధ గ్రామాల ఎస్సీ యువకులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దువ్వాడ సీఐగా బాధ్యతలు చేపట్టిన నమ్మి గణేష్ ను సత్కరించిన అగనంపూడి టీడీపీ నాయకులు

దువ్వాడ జూలై 11(పల్లె వెలుగు



దినపత్రిక):దువ్వాడ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నమ్మి గణేష్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయనను 85వ వార్డు ఇన్‌ఛార్జ్, మాజీ కార్పొరేటర్ ఇల్లపు ప్రసాద్, ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, అగనంపూడి ఏరియా ఆసుపత్రి మాజీ చైర్మన్ కొర్రయ జగదీశ్వరరావు తదితర టీడీపీ నాయకులు మర్యాదపూర్వకం గా కలిసి, దుశ్శాలువ కప్పి, పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ..



గతంలో స్టీల్ ప్లాంట్, పరవాడ పోలీస్ స్టేషన్లలో ఎస్.ఐ గా, గాజువాకలో సీఐగా పనిచేసిన నమ్మి గణేష్ కి ఎంతో అనుభవం ఉందని కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఆయన చూపిన చొరవ, ప్రజలకు అందించిన రక్షణ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ నమ్మి గణేష్ మాట్లాడుతూ.. "దువ్వాడ ప్రాంతంలో శాంతి భద్రతల విషయంలో ఎటువంటి రాజీ లేదు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతాం. ముఖ్యంగా గంజాయి, పేకాట, మహిళలపై ఈవ్ టీజింగ్ వంటి ఘటనలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం"అని స్పష్టం చేశారు. అలాగే, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెద్దపీట వేస్తామని, ప్రజలు ఎటువంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. త్వరలోనే తన పరిధిలోని గ్రామాలను సందర్శిస్తానని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అగనంపూడి పునరావాస కాలనీకి చెందిన నాయకులు తలారి వెంకటరమణ, వడ్డాది శ్రీనివాసరావు, బండారు చందు రమేష్, పలక అచ్యుత్, విందుల వంశీ, గొల్లవిల్లి సునీల్, తెలుగు మహిళా నాయకురాలు తమ్మిని రేవతి తదితరులు పాల్గొన్నారు.

# నరసన్నపేటలో కుప్పకూలిన వందేళ్ల భారీ వృక్షం.. ధ్వంసమైన నాలుగు విద్యుత్ స్తంభాలు

శ్రీకాకుళం/నరసన్నపేట, జూలై11 (పల్లె వెలుగు



దినపత్రిక): నరసన్నపేట పట్టణంలోని ఆదివారపు పేటలో శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికి వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా నేలమట్టమైంది.ఈ ఘటనలో సమీపంలో ఉన్న నాలుగు విద్యుత్ స్తంభాలు పూర్తిగా ధ్వంసం కాగా, విద్యుత్ వైర్లు రోడ్డుపై తెగిపడ్డాయి. అయితే, అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.చాలా కాలంగా స్థానికులకు నీడనిస్తూ, ఎండ వేడి నుండి ఉపశమనం కల్పిస్తున్న ఈ వృక్షం, నిన్న కురిసిన వర్షానికి వేర్లు బలహీనపడి కుప్పకూలింది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలపై ఈ భారీ వృక్షం పడటంతో, స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.సాధారణంగా ఈ చెట్టు కింద చుట్టుపక్కల ప్రాంతాల నుండి వచ్చే కూలీలు విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. అయితే, వర్షం పడటం మరియు ఆసమయం లో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. భారీ శబ్దంతో చెట్టు కూలడం, విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. చివరకు ఎవరికీ ఏమీ కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్త వాటిని ఏర్పాటు చేసే పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా మాతో పాటు ఉన్న వృక్షం ఇలా కూలిపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో నీడనిచ్చిన ఆ చెట్టు నేలమట్టం కావడం పట్ల వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజా సంకల్ప వేదిక ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ 11వ, తేదీ ఆత్మీయ సదస్సు

అల్లూరి జిల్లా,జూలై 11(పల్లె వెలుగు





దినపత్రిక)ప్రతినిధి పాంగి దావీదు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం బలపం పంచాయితీ పరిధిలోని . ప్రతి నెల 11వ తారీఖున జరిగే ఆత్మీయ కలయిక సమావేశాన్ని. ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా. బీసీవై పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్చార్జి కిల్లో రాజన్. నాదీ. హాజరయ్యారు. ఈ క్రమంలో ప్రజా సంకల్ప వేదిక ఆర్టిఐ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పాంగి.రాము మాట్లాడుతూ. హై కోర్టు న్యాయవాది మాదిరె రంగ సాయి రెడ్డి ఆదేశాల మేరకు. ఆర్టిఐ రాష్ట్ర అధ్యక్షులు జక్కు నరసింహమూర్తి. అల్లూరి జిల్లా ఇన్చార్జి ఉల్లి తలుపులు. ఉత్తరాంధ్ర రీజినల్ ఇన్చార్జి బంగారు రాజు. ఆదేశాల మేరకు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో ప్రజాధనం ఎలా ఖర్చు అవుతుందో సంక్షేమ పథకాలు ఎలా అమలు అవుతున్నాయి. అనే విషయాలు తెలుసుకునే హక్కు ఉందని ప్రజా సంకల్ప వేదిక ఆర్టిఐ హ్యూమన్ రైట్స్ విభాగాలు. చట్టబద్ధంగా కల్పించిన సాధనమే. ప్రజా సంకల్ప వేదిక ఆర్టిఐ హ్యూమన్ రైట్స్. సమాచార హక్కు చట్టం 2005 చాలామంది ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ ఉంటారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు కేవలం సమాచారం మాత్రమే ఇవ్వదు ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత. జవాబుదారితనం పెంచుతుంది. అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించేలా చేస్తుంది అవినీతిని అరికట్టడం కూడా ఈ. చట్టం కీలక పాత్ర పోషిస్తుంది సమాచారం అడగడం అంటే ప్రభుత్వాన్ని విమర్శించడం కాదు ప్రజాధనం ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై స్పష్టత. కోరడం మాత్రమే. ప్రజలు తమ హక్కులను. తెలుసుకొని వినియోగించు కోవాలని ప్రజాస్వామ్యం మరింత బలపడాలని. దేశంలో ఉన్న ప్రతి ఒక్క పౌరుడు గుర్తుంచుకోవాల్సినవిషయం ఒక్కటే సమాచారం అడగడం మీ హక్కు సమాచారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత ప్రజా సంకల్ప వేదిక ఆర్టిఐ హ్యూమన్ రైట్స్.సమాచార హక్కు చట్టాన్ని వినియోగించండి మీ హక్కులను కాపాడుకోండ.ని వివరించారు. ఈ క్రమంలో. జీకే వీధి మండల సభ్యులు.చింతపల్లి. జిమాడుగుల.కొయ్యూరు.పెద్దబయిలు.సభ్యులు. కలయికయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రెసిడెంట్.పాంగి కృష్ణారావు. హ్యూమన్ రైట్స్.స్టేట్ వైస్ ప్రెసిడెంట్. గెమ్మెలి సోమరాజు. కిల్లోవెంకటరావు. అల్లూరి సీతారామరాజు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్. తిమ్మారు. చిన్నబ్బాయి. పాంగి పాల్స్. సుకుర్ చిన్నయ్య. సన్యాసిరావు. ఆర్టిఐ సభ్యులు హ్యూమరైట్స్ సభ్యులు. విధిగా హాజరై. తమ ఆత్మీయ కలయిక సమావేశాన్ని జయప్రదం చేసుకున్నారు.

# మందపల్లి శనైశ్చరునికి ప్రత్యేక పూజలు, భారీగా చేరుకున్న భక్తులు



మందపల్లి, జూలై 11 (పల్లె వెలుగు దినపత్రిక) :- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలోని మందేశ్వర స్వామిశనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన దేవస్థానానికి శనివారం రోజున భక్తుల నుంచి ఆదాయం సమకూరింది. ఆలయ సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం, జులై 11, 2026 శనివారం జరిగిన వివిధ పూజా కార్యక్రమాల ద్వారా ఆలయానికి మొత్తం రూ.3,33,162 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. స్వామి వారికి నిర్వహించిన ముఖమండపం అభిషేకాల ద్వారా రూ.16,800, ఏకాదశ రుద్ర తైలాభిషేకాల ద్వారా రూ.72,250, మహాన్యాస పూర్వక తైలాభిషేకాల ద్వారా రూ.57,925, తైలం సమర్పించి దర్శనం చేసుకున్న వారి ద్వారా రూ.20,320, తిలదానం ద్వారా రూ.550, స్వయం హోమం ద్వారా రూ.2,400, స్వయం జపం ద్వారా రూ.2,500 మరియు కేశఖండన ద్వారా రూ.200 ఆదాయం లభించింది. వీటితో పాటుగా ఫోన్ పే (గూగూ) ద్వారా రూ.28,365, పరోక్ష పూజల ద్వారా రూ.81,100 మరియు అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.50,752 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు పేర్కొన్నారు

## స్టేట్ విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ గా వెంకటరమణ నియామకం



పిఠాపురం, జూలై11(పల్లె వెలుగు దినపత్రిక) పిఠాపురం పట్టణం నిజాయితీ నిస్వార్ధ సేవలకు కాండ్రేగుల వెంకటరమణ సేవలకు గుర్తింపు పలువురు ప్రముఖులు హర్షం అబినందనలు ప్రశంసలు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా హర్షాతిరే కాలు పిఠాపురంసమాజంలో ఉత్తమసేవలు అందించిన అరుదైన సేవా ప్రతినిధిగా నిస్వార్థం, నిజాయితీ తో అంకుటిత దీక్షతో అనునిత్యం సమాజంకు నిబద్ధతతో సేవలందించి న నిరాడంబరు డిగా అరుదైన ఆపద్బాంధవుడుగా గుర్తింపు పొందిన జాతీయ అవార్డు గ్రహీత కాండ్రేగుల వెంకటరమణకు రాష్ట్ర వినియోగ దారుల వ్యవహారాలు,ఆహార, పౌరసరఫరాల శాఖ రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులుగా ప్రభుత్వం నియమించడం పట్ల పలువురు పిఠాపురం వాసులు హర్షం వ్యక్తం చేస్తూ అభి నందించారు. కాండ్రేగుల వెంకటరమణ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో పలు రాష్ట్రాల్లో స్థిరపడిని ఎంతో మందికి ఎన్నో సేవా కార్యక్రమాలుతో పాటు ఆర్టిఐ చట్టం, వినియోగదారులు చట్టం,తూనికలు,కొలతలు, ఆహార భద్రత చట్టం,మొదలగు అనేక అంశాలపై చట్టాలు అమలుపై అవగాహ న సదస్సుల ద్వారా ప్రజలలో ఎంతో చైతన్యం తీసుకువచ్చేందు కు విశేష కృషి చేశారని ఆయన సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులుగా స్థానం కల్పించడంపై మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు ఈగల త్రిమూర్తులు, డి.సాల్మన్ రాజు ,టి.నాగేశ్వరప్రసాద్,రవీంద్ర బాబు తదితరులు అభినందిస్తూ మరిన్ని అభ్యున్నత పదవులు పొందాలని ప్రజలకు అనేక విశేష సేవలందించాలని ప్రజల్లో మరింతగా సుస్థిర స్థానం సంపాదించి చిరస్థాయిగా ప్రజల గుండెల్లో ఉండాలని వారు ఆకాంక్షించారు.

# యూరియా కోసం వెళ్లి తిరిగి వస్తుండగా రైతు మహిళ పినకాన కాంతమ్మ మృతి




శ్రీకాకుళం / నందిగాం,జూలై 11 పల్లె వెలుగు శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం పెద్దలవునిపల్లి గ్రామంలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన పినకాన కాంతమ్మ అనే మహిళ, వ్యవసాయ పనుల నిమిత్తం యూరియా కోసం సచివాలయానికి వెళ్లి వస్తుండగా అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై మృతి చెందారు. సమాచారం అందుకున్న వెంటనే నందిగాం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పినకాన అజయకుమార్, మళ్ల బాలకృష్ణ, పినకాన జోగారావు, కొన్ని సతీష్, కుజ్జ తాతయ్య, కుశరాజు, దిలీప్, ప్రసన్న కుమార్ తదితరులు బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. మరణించిన కాంతమ్మ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన టీడీపీ నాయకులు, వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అకస్మాత్తుగా జరిగిన ఈ మరణం గ్రామంలో విషాదఛాయలను నింపింది.

# జి.ఎస్.రావు మృతిపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి సంతాపం

అనపర్తి నియోజకవర్గ ప్రతినిధి, కర్రిదుర్గారెడ్డి,జులై 11పల్లె వెలుగు :తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ



(పీసీసీ) మాజీ అధ్యక్షుడు, కొవ్వూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేజి.ఎస్.రావు మరణం పట్ల అనపర్తి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లో చికిత్స పొందుతున్న జి.ఎస్.రావు కన్నుమూయడం బాధాకరమని డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా జీవితంలో జి.ఎస్.రావు చేసిన సేవలు, రాజకీయ రంగంలో ఆయనకున్న విశిష్ట అనుభవం చిరస్మరణీయమని అని ఆయన అన్నారు. జి.ఎస్.రావు మరణం రాజకీయ రంగానికి తీరని లోటని గుర్తు చేశారు. జి.ఎస్.రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు, అనుచరులకు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# మూడు జిల్లాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

రాజమండ్రి రూరల్, జూలై 11 (పల్లె వెలుగు దినపత్రిక) :- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి



నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 13న తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ మరియు ఏలూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 10:25 గంటలకు ఉండవల్లి నివాసం నుండి బయలుదేరి, 11 గంటలకు కడియం మండలం వేమగిరి చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్దకు చేరుకుని, గేటు నంబర్-1ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో రైతులతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యలు, సూచనలను అడిగి తెలుసుకుంటారు. మధ్యాహ్నం 12:55 గంటలకు వేమగిరి హెలిప్యాడ్ నుండి ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 1:20 నుండి సాయంత్రం 5:15 గంటల వరకు ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ముఖ్యంగా ఈసీఆర్ఎఫ్ గ్యాప్-2, పవర్ హౌస్ నిర్మాణ పురోగతిని నిశితంగా సమీక్షిస్తారు. ప్రాజెక్టు పనులపై ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడతారు. సాయంత్రం 5:25 గంటలకు ప్రాజెక్టు ప్రాంతం నుండి బయలుదేరి, 6:05 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు

# డిగ్రీ ఆర్.జె.డి పై చర్యలు తీసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ డిమాండ్

రాజమహేంద్రవరం, జూలై 11 (పల్లె వెలుగు దినపత్రిక) :- శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల హాస్టల్‌ను స్వాధీనం చేసుకోవాలన్న కమిషనర్ ఆదేశాలను అమలు




చేయడంలో విఫలమైన డిగ్రీ ఆర్.జె.డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు వై. భాస్కర్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని శ్యామల సెంటర్ ఎస్.ఎఫ్.ఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫిబ్రవరి 25న కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు హాస్టల్‌ను స్వాధీనం చేసుకోవాల్సి ఉండగా, నేటికీ అమలు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చిన సమయంలో పది రోజుల్లోనే హాస్టల్‌ను స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చిన ఆర్.జె.డి, ఆ తర్వాత హితకారిణి సమాజం సహకరించడం లేదని సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం లోపు హాస్టల్‌ను స్వాధీనం చేసుకోకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ సభ్యులు జ్యోతి, సౌమ్య, కార్తిక్, నాగచైతన్య పాల్గొన్నారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com